సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 30 । జూలై । 2023

ఊరంతా ఏకమై..



సిరికొండ: ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలోని చిన్న గోధుమల్యాల గ్రామానికి సంబంధించిన విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నాలుగు రోజులుగా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో శనివారం ఊరంతా ఏకమై ఏడు స్తంభాలను తిరిగి నిలబెట్టారు. అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సిఉంది.



ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి

కైలాస్‌నగర్: దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని బాంసెఫ్ జిల్లా అధ్యక్షుడు గణేశ్ మెకానే డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి శనివారం వినతిపత్రం అందజేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తూ..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కుష్బూ గుప్తా శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సెలవు రోజైనా నేరుగా కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



రికార్డులు పరిశీలిస్తున్న నరేందర్ రాథోడ్

గుడిహత్నూర్: విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేశారు. ఇద్దరు ఏఎన్‌ఎంలు, స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్ట్ మాత్రమే ఉండగా మిగతా సిబ్బంది గైర్హాజరయ్యారు. వెంటనే వైద్యాధికారి శ్యాంసుందర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సిబ్బంది గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో స్టాఫ్‌నర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి శ్రీకాంత్ ఉన్నారు.

బోథ్ అస్థిత్వ పోరాటానికి మద్దతివ్వండి

- అన్ని పార్టీల జిల్లా అధ్యక్షులకు డివిజన్ సాధన సమితి లేఖలు



శిబిరం వద్ద లేఖలతో సభ్యులు

బోథ్: బోథ్ అస్థిత్వ పోరాటానికి అన్ని పార్టీలు మద్దతు తెలపాలని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు శనివారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీతో పాటు పలు పార్టీల జిల్లా అధ్యక్షులకు లేఖలు రాశారు. బోథ్ డివిజన్‌తో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు, కోర్టు నూతన భవన నిర్మాణం తదితర 31 అంశాలతో కూడిన సమస్యలపై లేఖలు రాశారు. ప్రజాప్రతినిధులంతా రాజీనామా చేసి ముందుకు రావాలన్నారు. లేకుంటే ప్రజాకోర్టులో వారిని ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. మరో వైపు డివిజన్ కోసం చేస్తున్న దీక్షలు శనివారానికి 13వ రోజుకు చేరాయి. నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు దీక్షలో కూర్చున్నారు. మద్దతుగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హనుమాన్, విఠలేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పాతాళగంగ పైపైకి



గాదిగూడ మండలంలో జిల్లాలోనే అతి తక్కువ లోతులో అంటే 0.01 మీటర్లలోనే భూగర్భ జలాలు లభ్యం అవుతున్నాయి. ఈ మండలంలో పలు చోట్ల బోరుబావుల నుంచి నీరు ఉబికి వస్తుంది.



నార్నూర్ మండలం జలాల లభ్యతలో రెండో స్థానంలో ఉంది. 0.26 మీటర్లలోనే ఇక్కడ భూగర్భజలాలు ఉన్నాయి. బావులు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి.



ఇచ్చోడ మండలంలో భూగర్భ జలాల మట్టం ఒక్కసారిగా పెరిగింది. ఈ మండలంలోని అడెగామ (బి)లో భూఉపరితలం నుంచి 0.85 మీటర్ల లోతులోనే నీళ్లు లభ్యం అవుతున్నాయి. బావుల్లో చేతికి అందేలా జలాలు ఉన్నాయి.



ఉట్నూర్‌లోనూ భూగర్భజలాల మట్టం గణనీయంగా పెరిగింది. ఒక మీటరులోనే నీటి లభ్యత ఉంది. బావుల్లో నీళ్లు పైవరకు వచ్చేశాయి.



సిరికొండ మండలంలో భూ ఉపరితలానికి సమాంతరంగా బావిలో నీళ్లు

- చేతికందే లోతులోనే నీళ్లు
- ఉబికివస్తున్న భూగర్భజలాలు
- నిండుకుండల్లా బావులు

భూగర్భజలాల నెలవారీ రిపోర్టు..
జూలై 2023 : 3.30 మీటర్లు
జూన్ 2023 : 9.38 మీటర్లు
మే 2023 : 8.86 మీటర్లు
జూలై 2022 : 2.93 మీటర్లు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భజలాల మట్టం గణనీయంగా పెరిగింది. ఉపరితలం నుంచి సగటున 3.30మీటర్లలోనే (అంటే 10 అడుగుల్లోనే) జలాలు లభ్యమవుతున్నాయి. మండలాల పరంగా గరిష్టంగా 8.36 మీటర్లలో లభ్యత ఉండగా.. కనిష్టంగా 0.01 మీటర్లలోనే ఉంది. భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 26 చోట్ల ఫిజియోమీటర్ల ద్వారా జలాల లభ్యత వివరాలు నమోదు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం తాజా రిపోర్టు విడుదల చేశారు. ఇందులో భూగర్భజలాల లభ్యత పైన పేర్కొన్న విధంగా ఉంది.

జిల్లాలో వర్షపాతం వివరాలు.. (జూన్ 1 నుంచి జూలై 29 వరకు)
కురవాల్సింది : 493.8 మిల్లీ మీటర్లు
కురిసింది : 791.1 మిల్లీ మీటరు
వ్యత్యాసం : 60 శాతం అధికం
స్థితి : అత్యధికం

అనావృష్టి నుంచి అతివృష్టి వరకు..

జూన్ నుంచి వానాకాలం మొదలు కాగా ఆ నెలలో లోటు వర్షపాతం నమోదైంది. మూడో వారంలో చుక్క వర్షం పడలేదు. జిల్లా అంతటా అనావృష్టి కనిపించింది. ప్రాజెక్టులు, చెరువులు నీళ్లు లేక బోసిపోయాయి. జూలై మొదటి రెండు వారాల్లోనూ ఇదే పరిస్థితి. మూడో వారం నుంచి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ వారంలో భారీ వర్షాలు కురిశాయి. నాలుగో వారంలో అతి భారీ వర్షాలతో ఏకంగా అతివృష్టి నమోదైంది. జలాశయాలన్నీ ఒక్కసారిగా నిండుకుండలా మారాయి. పెన్‌గంగ ఉప్పొంగి ప్రవహించింది. ఇప్పటికీ 60 వేల క్యూసెక్కుల వరద ఉంది. కుప్టి వద్ద ఈ నెల 21న లక్షా 40వేల క్యూసెక్కుల వరద పోటెత్తింది. ఈ వరదంతా దిగువన కడెం ప్రాజెక్టుకు చేరుకుంది. కుంటాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలు కనువిందు చేస్తున్నాయి.

అక్రమ ఆస్తులు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- కంది శ్రీనివాస్‌రెడ్డి నన్ను హత్య చేసేలా వ్యవహరిస్తున్నాడు..
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి తనపై అసత్య ఆరోపణలతో పాటు ప్రజలను రెచ్చగొడుతూ తనను హత్య చేసేలా వ్యవహరిస్తున్నాడని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులు కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు సంపాదించారని 'కంది' చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వాటిని రుజువుచేస్తే రాజకీయ సన్యాసంకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే శనివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జోగు రామన్న, ఆయన కుటుంబ సభ్యులపై విమర్శలు చేస్తే కాంగ్రెస్ పార్టీ తనకే టికెట్ ఇస్తుందని భావిస్తూ కంది శ్రీనివాస్‌రెడ్డి ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నాడని, ఇది తగదన్నారు. తన కుటుంబానికి వందల ఎకరాల వ్యవసాయ భూమి, రూ.100 కోట్ల విలువ చేసే ఓ పాఠశాల, రూ.70 కోట్ల విలువ చేసే ఫంక్షన్ హాల్, హైదరాబాద్‌లో రూ.32 కోట్లతో ఇల్లు.. అంటూ శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. తన చిన్న కుమారుడు మహేందర్ రిమ్స్‌లో స్వీపర్ పోస్టుల నియమాకం కోసం రూ.3 లక్షల చొప్పున వసూలు చేసినట్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని, లేకుంటే కోర్టులో పరువునష్టం కేసు వేస్తానని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు రమేశ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేదెప్పుడో..?

- వర్షాలు కురుస్తున్నా కానరాని 'హరితహారం'
- నాటేందుకు ముందుకు రాని యంత్రాంగం
- ఇంకా నర్సరీల్లోనే మొక్కలు • అనువైన కాలం.. ఆచరిస్తే ప్రయోజనం



పొన్నారి నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు

కైలాస్‌నగర్: జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఒక్కో మండలంలో 400 నుంచి 600 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. హరితహారం ద్వారా మొక్కలు నాటేందుకు ఇది అనువైన సమయం. ప్రస్తుతం నాటితే త్వరగా పెరిగే అవకాశముంటుంది. అయితే యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఏటా జూలైలోనే ఈ కార్యక్రమం చేపట్టేవారు. పల్లె, పట్టణమనే తేడా లేకుండా అన్ని వర్గాలను భాగస్వాములను చేసి ఓ ఉద్యమంలా నిర్వహించేవారు. అయితే జూలై చివరకు వచ్చినా ఇంకా ప్రారంభించకపోవడం గమనార్హం.

అనువైన కాలం...

2023–24కు గాను హరితహారం కింద నాటేందుకు డీఆర్డీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని 468 నర్సరీల్లో, అటవీశాఖ ఆధ్వర్యంలో 12 నర్సరీల్లో కలిపి 41లక్షల మొక్కలు పెంచారు. ప్రతీ నర్సరీలో మొక్కలు ఏపుగా పెరిగి ఇవి నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటితో ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్‌ఖాళీస్థలాలు, కార్యాలయాలు, రహదారులకిరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాల్సి ఉంది. అలాగే గతంలో నాటిన మొక్కల్లో కొన్ని ఎండిపోవడం, పశువులు తినేసిన చోట్ల తిరిగి నాటాల్సి ఉంటుంది. ఇళ్లలో పెంచేందుకు అవసరమైన పూలు, పండ్ల మొక్కలు అందజేయాల్సిన బాధ్యత పంచాయతీలది. అయితే జీపీ కార్మికుల సమ్మె నేపథ్యంలో మొకల పంపిణీకి కొంత అవరోధం ఏర్పడుతోంది.

దృష్టి సారించని యంత్రాంగం

ఏటా ఈ సీజన్‌లో గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపల్ పరిధిలో ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగేది. ప్రస్తుతం జూలై నెలాఖరుకు చేరినా ఏపుగా పెరిగిన మొక్కలు నర్సరీల నుంచే ఇంకా బయటకు రావడం లేదు. వాటిని నాటించాల్సిన పంచాయతీ, డీఆర్డీవో, మున్సిపల్ శాఖలు పట్టించుకోవడం లేదు. అదును దాటుతుండటంతో ఇంకెప్పుడు మొక్కలు నాటుతారనే ప్రశ్న తలెత్తుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి మొక్కలు నాటే దిశగా చర్యలకు ఉపక్రమించాలని పలువురు కోరుతున్నారు.

వేగవంతం చేస్తాం

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాం. జోరుగా కురుస్తున్న వర్షాలతో ఈ ప్రక్రియకు కొంత అంతరాయం కలిగింది. మిగతా శాఖలు ప్రారంభించలేదు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అన్ని శాఖ లు లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా కార్యక్రమాన్ని వేగవంతం చేస్తాం. – రాథోడ్ రవీందర్, పీడీ

భక్తిశ్రద్ధలతో మొహర్రం





మొహర్రంను జిల్లా వ్యాప్తంగా శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల్లో సవారీ బంగ్లాల వద్ద సందడి కనిపించింది. అసైదులా.. అసైదులా అంటూ దప్పు వాయిద్యాల నడుమ సవార్లను పట్టణ వీధుల్లో ఊరేగించారు. యువకులు లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. ప్రజలు సవార్లకు నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చివరగా సవార్ల నిమజ్జనోత్సవం చేపట్టారు. – ఆదిలాబాద్

66 కాల్స్.. 11 పరిష్కారం!

- 'టోల్‌ఫ్రీ కంట్రోల్'కు సమస్యల వెల్లువ
- పరిష్కారం మాత్రం అంతంతే..



సమస్యలను ఫోన్ ద్వారా నమోదు చేసుకుంటున్న ఉద్యోగి

కైలాస్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1939 సమస్యల నివేదనకే తప్ప పూర్తిస్థాయిలో పరిష్కారం చూపడం లేదనే విమర్శలున్నాయి. ఈ నెల 11న కలెక్టరేట్‌లో దీనిని ఏర్పాటు చేశారు. షిష్టుకు ఇద్దరు చొప్పున జూనియర్ అసిస్టెంట్‌స్థాయి ఉద్యోగులు ఆరుగురిని ఇన్‌చార్జీలుగా నియమించారు. ఇప్పటివరకు వరదలు, ఇతర సమస్యలపై జిల్లావ్యాప్తంగా 66 కాల్స్ వచ్చాయి. ఆయా సమస్యలను నమోదు చేసుకుంటున్న సిబ్బంది సంబంధిత శాఖలకు సమాచారాన్ని చేరవేస్తున్నారు. అయితే ఇందులో ఇప్పటి వరకు కేవలం 11 మాత్రమే పరిష్కారం అవడం గమనార్హం.

విద్యుత్‌శాఖకు ఒక్క కాల్ రాలేదట!

విద్యుత్ పరమైన సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో 9440811700 టోల్‌ఫ్రీ నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఈ సంపత్‌కుమార్ ప్రకటించారు. ఇటీవల భారీ వర్షాలు నమోదై విద్యుత్ సమస్యలు తలెత్తినా ఈ నంబర్‌కు ఒక్క కాల్ రాలేదని ఆ శాఖ అధికారులు చెప్పడం గమనార్హం. సాక్షాత్తు విద్యుత్‌శాఖ ఏడీఈ దేవేగౌడ టోల్‌ఫ్రీ నంబర్‌ను రెండుసార్లు సంప్రదించేందుకు యత్నించగా దాని ఇన్‌చార్జి అందుబాటులోకి రాకపోవడం విశేషం. ఈ ఒక్క ఘటన చాలు విద్యుత్ శాఖ కంట్రోల్ రూం ఏ మేరకు పనిచేస్తుందో స్పష్టమవుతుంది.

క్లుప్తంగా

బండి సంజయ్ నియామకం హర్షణీయం

ఆదిలాబాద్‌: కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ని జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై ఎంపీ సోయం బాపూరావు హర్షం వ్యక్తం చేశారు. సామాన్య కార్పొరేటర్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడంలో సంజయ్ విశేషంగా కృషి చేశారన్నారు. కష్టపడే నాయకులకు బీజేపీలో సముచిత స్థానం ఉంటుందని, కేంద్రంలో ఇటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

కేయూక్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ నెల 30, 31, ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహించనున్న వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ, ఫార్మడీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల వివిధ పేపర్లు, పీజీ కోర్సులకు నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, లా ఫైనల్ విద్యార్థులకు మూట్ కోర్టు పరీక్షలు వాయిదా వేసినట్లు వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామని పేర్కొన్నారు.

బాలింతకు దారి కష్టాలు



తాత్కాలిక వంతెనపై పసిపాపతో బాలింత

ఇచ్చోడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కొట్టుకుపోయాయి. శనివారం మండలంలోని జల్దా గ్రామానికి చెందిన బాలింత పసిపాపను తీసుకొని ఆస్పత్రికి ఇచ్చోడ మండల కేంద్రానికి వచ్చింది. సిరిచెల్మ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో ప్రమాదకారంగా ఉన్న రోడ్డు నుంచి పసిపాపతో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

గ్రామాల్లో ఎంపీ పర్యటన



పాటగూడలో వంతెనను పరిశీలిస్తున్న ఎంపీ

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్, పాటగూడ, హీరాపూర్ గ్రామాల్లో శనివారం జిల్లా ఎంపీ సోయం బాపురావ్ పర్యటించారు. భారీ వర్షంతో వరదనీటి కారణంగా కోతకు గురైన పాటగూడ వంతెన, గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. సంబందిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కోతకు గురైన రోడ్లు, కల్వర్టు మరమ్మతులు చేయించి ప్రజలకు రోడ్డు సమస్య లేకుండా చూడాలన్నారు. పాటగూడ వంతెన మరమ్మతులకు ఎంపీ నిధుల నుంచి రూ.3లక్షల నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ముత్నూర్ గ్రామాన్ని సందర్శించి ఆదివాసీ పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి కోతకు గురైన రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. .

రుయ్యాడిలో భక్తజనసందోహం

- ముగిసిన మొహర్రం వేడుకలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూజలు



పూజలు చేస్తున్న ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనిషా దంపతులు



డప్పు వాయిస్తున్న దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి

తలమడుగు: రాష్ట్రంలో మొహర్రం ఉత్సవాలకు ప్రసిద్ధిగాంచిన రుయ్యాడిలో శనివారం సంబురాలు ముగిశాయి. ముగింపు సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. హస్సేన్ హుస్సేన్ సవార్లను (పీరీలను) దర్శించుకుని పూజలు చేస్తే అనుకున్న కోరికలు నెరవేరుతాయని ఇక్కడికి వచ్చే భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం తరలివచ్చి పూజలు చేశారు. చివరి రోజు కావడంతో భక్తులతో హస్సేన్ హుస్సేన్ దేవస్థానం కిటకిటలాడింది. గురువారం రాత్రి నుంచి శనివారం సాయత్రం వరకూ మొహర్రం వేడుకలు నిర్వహించారు. దేవస్థానంలో మాజీ ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనిషా పవన్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి డప్పువాయిస్తు గ్రామంలో ఊరేగింపులో పాల్గొన్నారు. వివిధ వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి.



రుయ్యాడిలో పీరీలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులకు ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లు...

మొహర్రం వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హస్సేన్ హుస్సేన్ దేవస్థానం ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం, వాహనాల పార్కింగ్, అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై ధనశ్రీ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



పీరీల ఊరేగింపులో భక్తులు

పర్యావరణ హితం కోసం..

నిర్మల్‌ఖిల్లా: పర్యావరణాన్ని కాపాడుదామని చాలామంది చెబుతుంటారు... కొంతమందే పాటిస్తుంటారు. కానీ పర్యావరణహితం కోసం నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తాన్న లక్ష్మి డీఆర్డీవో సాంకేతిక సహకారంతో తయారైన బయోడీగ్రెబుల్ ప్లాస్టిక్ రహిత చేతి సంచులను ప్రజల్లోకి తీసుకెళ్తూ చైతన్యవంతుల్ని చేస్తోంది. ఈ అంశంపై సాక్షి ప్రత్యేక కథనం...

- నిర్మల్‌లో నేలలో కరిగిపోయే సేంద్రియ చేతిసంచుల విక్రయ కేంద్రం
- డీఆర్డీవో సాంకేతిక సహకారంతో ఏర్పాటు..
- ప్రజల్ని చైతన్యం చేయడమే ధ్యేయమంటున్న నిర్వాహకురాలు
- రాష్ట్ర మంత్రి, ప్రభుత్వాధికారుల సహకారంతో ముందుకు..



సేంద్రియ చేతిసంచులు



ప్లాస్టిక్ ద్వారా కాలుష్యం ఇలా...

పర్యావరణ పరిరక్షణ కోసం...

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తాన్న లక్ష్మి పర్యావరణానికి హాని చేకూర్చని చేతి, క్యారీ బ్యాగులను తయారు చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్తోంది. దీన్ని లాభసాటి వ్యాపారంగా కాకుండా ప్రజల్ని చైతన్యవంతం చేసే కార్యక్రమంగా ముందుకు సాగుతోంది. జిల్లా కేంద్రంలో అవుట్‌లెట్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించింది. దీనికి రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రోత్సాహం కూడా తోడు కావడంతో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్‌లను కలిసి ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే నష్టాలను వివరిస్తూనే ఈ బయోడీగ్రేడెబుల్ క్యారీ బ్యాగులు, చేతి సంచుల విక్రయం కోసం జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ ప్రాంతంలో ఆథరైజ్డ్ ఫ్రాంచైజీని నెలకొల్పింది.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా...

నిత్యజీవితంలో ప్లాస్టిక్ భాగమైంది. ప్లాస్టిక్‌తో నేల, నీరు కలుషితమవుతోంది. ప్రాణాంతకమైన క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీఆర్డీవో శాస్త్రవేత్త వీరబ్రహ్మం ప్రత్యేక కృషితో బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్ రహిత ముడి పదార్థాలను ఉపయోగించి చేతిసంచులను, క్యారీ బ్యాగులను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వీటి తయారీని చేపడుతున్నారు. ఈ బయోడిగ్రేడబుల్ క్యారీ బ్యాగులు కేవలం 30రోజుల లోపే భూమిలో కరిగిపోతాయి.

ఈ సేంద్రియ చేతి బ్యాగుల ప్రత్యేకతలు ఇవీ...

- ఈ సేంద్రియ ముడి పదార్థాలతో తయారైన చేతి సంచులు అతి త్వరగా నేలలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారిపోతాయి.
- మొక్కజొన్నలు, కూరగాయల పిండి, గుజ్జు తదితర ముడి పదార్థాలతో ఈ చేతి సంచి బ్యాగులను తయారు చేస్తున్నారు.
- వీటిని వాడి పారవేసిన 30రోజుల్లో మట్టిలో కరిగిపోయి ఎరువుగా మారిపోతాయి.
- ఈ బ్యాగులను పూర్తిగా కాల్చినట్లయితే బూడిదగా మారిపోతుంది. ఎటువంటి విష వాయువులను విడుదల చేయవు.
- ఈ బ్యాగులను పొరపాటున మూగజీవాలు తిన్నా ఎటువంటి సమస్యలు రావు. జీర్ణం అయిపోతాయి.
- ఈ బ్యాగులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులలో ఉండే బిస్ఫినాల్ -ఏ అనే విషపూరిత రసాయనం ఉండదు.
- ఈ బ్యాగులను వాడిన తర్వాత సేకరించి మళ్లీ రీసైకిల్ చేయాల్సిన అవసరం లేదు.

ఆలోచన మొదలైంది ఇలా...



సేంద్రియ కవర్లు

హైదరాబాద్ కేంద్రంగా గల డీఆర్డీవో (భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ) శాస్త్రవేత్త కె.వీరబ్రహ్మం తన ప్రత్యేక ఆలోచనతో మొక్కజొన్నల గుజ్జు, కూరగాయల పిండి తదితర ముడిసరుకులతో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా కొత్త బ్యాగులను రూపొందించే ప్రక్రియను చేపట్టారు. వీరి ఇంటర్వ్యూ వివరాలను టీవీలో చూసిన జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మి ప్రత్యేకంగా వారిని కలిసి దానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకుంది. హైదరాబాద్‌లోని ఈ చేతి సంచుల తయారీ కేంద్రాన్ని సందర్శించి వారి సహకారంతో నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసింది.



విక్రయకేంద్రంలో నిర్వాహకురాలు లక్ష్మి

ఇంటర్వ్యూ చూసి స్ఫూర్తిని పొందాను...

రెండేళ్ల క్రితం పర్యావరణహితమైన ప్లాస్టిక్ రహిత క్యారీ బ్యాగుల గురించి వివరిస్తున్న డీఆర్‌డీవో శాస్త్రవేత్త కె.వీరబ్రహ్మం ఇంటర్వ్యూ టెలివిజన్‌లో చూశాను. వెంటనే హైదరాబాద్ వెళ్లి వారిని కలిశాను. హైదరాబాద్ యూనిట్ కేంద్రంగా తయారవుతున్న ప్లాస్టిక్ రహిత చేతి సంచులను తయారు చేస్తున్న కేంద్రానికి వెళ్లి పరిశీలించాను. వారి సహకారంతో పంపిణీదారుగా నిర్మల్ జిల్లా కేంద్రంలో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశాను.

– తాన్న లక్ష్మి, విక్రయ కేంద్రం నిర్వాహకురాలు, నిర్మల్

బోథ్ ప్రజల ఆకాంక్షను నెరవేర్చండి

- మంత్రి హరీశ్‌రావును కలిసిన బోథ్ జెడ్పీటీసీ



మంత్రిని కలిసిన జెడ్పీటీసీ దంపతులు

బోథ్‌: బోథ్‌ను డివిజన్‌గా మార్చాలని మండల జెడ్పీటీసీ సంధ్యారాణి శనివారం హైదరాబాద్‌లో ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావును కలిసి విన్నవించారు. ఎన్నో ఏళ్ల నుంచి డివిజన్ చేయాలని విన్నవిస్తున్నా ఇప్పటి వరకూ పట్టించుకోవడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బోథ్‌లో ఏర్పాటు చేయాల్సిన డిగ్రీ కళాశాలను ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో స్థానిక విద్యార్థులు నష్టపోతున్నారని, అలాగే సమాచార లోపంతో బోథ్ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి తక్కువ నిధులు కేటాయించారని, దాదాపు రూ.3కోట్లు అవసరమవుతాయని, స్థానిక ప్రభుత్వాస్పత్రిని 50పడకల నుంచి వంద పడకలుగా మార్చాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జెడ్పీటీసీ తెలిపారు. బోథ్ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్రప్రసాద్ ఉన్నారు.

మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ



మానవహారంగా ఆదివాసీలు

గుడిహత్నూర్‌: మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొల్పడానికి తగు చర్యలు చేపట్టాలని ఆదివాసీ సేవ, ఆదివాసీ మహిళా సేన ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఆదివాసీలు శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మొకాశి మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మహిళలు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కుంటాల దారిలో... బండరాళ్లు

నేరడిగొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో అటవీ ప్రాంతంలో గుట్ట అంచున ఉండే వృక్షాలు, బండరాళ్లు జారి రోడ్డుపై పడుతున్నాయి. మండలంలోని కుంటాల జలపాతానికి వెళ్లే మార్గంలో కుంటాల(కె) గ్రామ సమీపంలోని ఘాట్ వద్ద బండ రాళ్లు, వేర్లతో సహ చెట్లు రోడ్డుపై వచ్చిపడ్డాయి. ఈ రోడ్డులో పర్యాటకులు జలపాతానికి వెళ్లాల్సి ఉంటుంది. దీంతోపాటు ఆ దారిగుండా కుంటాల(బి), వెంకటాపూర్, మాట్‌లొద్ది, నాగమల్యాల్, గోవింద్‌పూర్, పీచర, లక్ష్మీపూర్, అద్దాల తిమ్మాపూర్ తదితర గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండా పయనిస్తుంటారు. రాత్రి సమయంలో వీటిని గమనించకుంటే పెద్ద ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకొని వాటిని తొలగించాలని పర్యాటకులు కోరుతున్నారు.





కుంటాలకు వెళ్లేదారిలో రోడ్డుపై రాళ్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని వాగ్దారి గ్రామానికి చెందిన యువకుడు జాదవ్ కృష్ణకాంత్ మండల కేంద్రంలో వారసంత (అంగడికి) ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పోలీస్‌స్టేషన్ సమీపంలో రాంగ్‌రూట్‌లో వస్తున్న మహారాష్ట్రకు చెందిన కారు ఢీకొట్టింది. కారు ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు టోల్‌ప్లాజా దాటిన తర్వాత ఆ వాహనాన్ని పట్టుకున్నారు. క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

గుడిహత్నూర్‌: మండలంలోని డొంగర్‌గావ్‌కు చెందిన శేక్ షౌకత్(55) అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని డొంగర్‌గావ్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... షౌకత్ గత కొన్ని రోజులుగా మధుమేహ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కాలికి గాయం కాగా డాక్టర్లు ఒక వేలును తీసి వేశారు. తీవ్ర మానసిక ఆందోళనకు గురై తాగుడుకు బానిసయ్యాడు. గాయం మానకపోగా కాలును సైతం తీసి వేయాల్సి ఉంటుందని డాక్టర్లు తెలుపడంతో మరింత మానసిక ఒత్తిడికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు పీరీల పండుగకు వెళ్లడంతో షౌకత్ ఇంట్లో ఉరేసుకున్నాడు. బంధువులు గమనించి రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్‌: సవార్ల పండుగను చూడడానికి వెళ్లిన ఓ బాలుడు తప్పిపోయి తిరిగి దొరికిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలనీలో శ్రీను, పద్మ దంపతుల కుమారుడు శనివారం అదృశ్యమయ్యాడు. తల్లి డయల్ 100 చేసి ఫిర్యాదు చేసింది. దీంతో బ్లూ కోట్స్ సిబ్బంది అరవింద్, మహేష్‌రెడ్డి ఆ బాలుడిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై వంగ విష్ణువర్ధన్ తెలిపారు.

'కుంటాల'కు పర్యాటకుల తాకిడి



నేరడిగొండ: కుంటాల జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో శనివారం భారీగా తరలివచ్చారు. రాష్ట్రం నుంచే కాకుండా ఢిల్లీ, నేపాల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి సైతం తరలివచ్చి జలపాతం అందాలను వీక్షించారు. సెల్ఫీలు దిగుతూ కనిపించారు. మరోవైపు అటవీశాఖ ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టారు. జలధారల వద్దకు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేయడంతో పర్యాటకులు దూరం నుంచే ప్రకృతి అందాలను తిలకించారు.



జలపాతాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు



నేపాల్ నుంచి వచ్చిన యువతులు